30ఏళ్లకు సరిపడా అభివృద్ధి

• ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణాన్ని ముప్పై ఏళ్లకు సరిపడా అభివృద్ధి చేస్తానని, ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించినందుకు వారికి ఎలాంటి పనులు చేయాలో తనకు తెలుసునని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ సాధారణ సమావేశాన్ని సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. 20ఏళ్లుగా మంచిర్యాల మున్సిపాలిటీకి తాగునీటిని ప్రతిరోజు అందించలేకపోయారని, కానీ తాను గెలిచిన నెలరోజుల్లోనే తాగునీటిని ప్రతీరోజు అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట రైతుల నుంచి దోచుకున్నారని, కానీ గతేడాది తరుగు లేకుండా, కేవలం గన్నీ సంచి బరువును మాత్రమే తొలగించి, ధాన్యం సేకరించినట్లు తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ఏరియాలో రోడ్ల వెడల్పు కార్యక్రమంలో భాగంగా రూ.38కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని, అండర్ గ్రౌండ్ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చేలా పనులు త్వరలోనే మొదలు పెడతామన్నారు. మంచిర్యాలలో ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ పార్కులు మంజూరు చేయించామన్నారు. వైకుంఠధామం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, శివరాత్రికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ కె.విజయ్ కుమార్, మున్సిపల్ ఇంజినీర్ యండి మసూద్ అలీ, టౌన్ ప్లానింగ్ అధికారులు బి.శ్యాంసుందర్, రాజ్‌కుమార్, ఆర్‌వో శ్రీనివాస్ రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ అఫ్రీన్ తబుస్సుమ్, ఉదయ్ కిరణ్, వైకుంఠం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.133.39లక్షల ద్వారా అభివృద్ధి చేయడం, 3వ వార్డు తిలక్‌నగర్ ఏరియాలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు కోసం రూ. 2.52లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. డీఎఫ్‌వో వాటర్ ట్యాంకును తొలగించి, ఆ స్థలంలో మల్టీస్టోర్ పార్కింగ్ కాంప్లెక్స్, దాని చుట్టూ కమర్షియల్ షాపులను నిర్మించేందుకు ఆమోదం తెలుపగా, పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు ఆరు వరుసల రోడ్డు డెవలప్ చేయాల్సి ఉన్నందునా, ఆ రోడ్డులో గల ఐబీ జంక్షన్, వెంకటేశ్వర టాకీస్ జంక్షన్, బెల్లంపల్లి చౌరస్తా జంక్షన్, లక్ష్మీ టాకీస్ జంక్షన్‌లు వెడల్పు ఉన్నందునా వాటి వెడల్పులను తగ్గించేందుకు ఆమోదం తెలిపారు. మంచిర్యాల మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించేందుకు గతంలో మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీలకు రూ. 21.75కోట్ల పరిపాలనా అనుమతులు వచ్చాయి. మంచిర్యాలలో నిర్మించాల్సిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలంలో ప్రస్తుతం ప్రభుత్వం మాతా శిశు ఆసుపత్రి నిర్మాణం జరుగుతున్నందునా, ఆయా పనులను ప్యాకేజీ నుంచి తొలగించేందుకు ఆమోదం తెలిపారు.

ఆదివాసీల సంక్షేమానికి పాటు పడదాం

• ఏసీపీ రవికుమార్




సరుకులు అందిస్తున్న ఏసీపీ రవికుమార్

కాసిపేట: ఆదివాసీల పిల్లలు ఉన్నత విద్య అభ్యసించాలని ఆదివాసీ కుటుంబాలకు పోలీసులు అండగా ఉంటామని వారి సంక్షేమానికి పాటు పడతామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పాత తిరుమలపూర్ ఆదివాసీ గిరిజన కుటుంబాలకు సోమవారం 'పోలీసు మీ కోసం-కమ్యూనిటీ కాంటక్ట్' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ఆదివాసీ గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ.. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు మెరుగు పడ్డాయని, తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనుల శ్రేయస్సుకు పోలీసు శాఖ ఎల్లప్పుడు సంసిద్ధంగా ఉంటుందన్నారు. ఆదివాసీ గిరిజనుల పిల్లలు సైతం ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ప్రభుత్వ పథకాలు గిరిజనులకు చేరేందుకు పోలీసు శాఖ అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, ఓరియంట్ సిమెంట్ కంపెనీ సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఆదివాసీలు పాల్గొన్నారు.

కొమ్మలు నరికేశారు..!

సాక్షి ఎఫెక్ట్..



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

బెల్లంపల్లి: బెల్లంపల్లి బాబుక్యాంపు బస్తీకి వెళ్లే మార్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్ తీగలపై ఎగబాకిన చెట్ల కొమ్మలు, తీగ జాతి మొక్కలు అల్లుకుపోయి ప్రమాదకరంగా ఉన్న వైనాన్ని సోమవారం 'అల్లుకున్న ప్రమాదం' శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఈ మేరకు స్పందించిన ఎన్పీడీసీఎల్ బెల్లంపల్లి పట్టణ ఏఈ మల్లేశం తక్షణమే చెట్ల కొమ్మల నరికివేత చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ట్రాన్స్‌ఫార్మర్ పై వాలిన చెట్ల కొమ్మలు, అల్లుకున్న తీగ మొక్కలను పూర్తిగా తొలగించేశారు. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించిన 'సాక్షి'ని పలువురు స్థానికులు అభినందించారు.

క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని సోమగూడెంలో ఈ నెల 5వ తేదీన జరిగిన స్టేట్ లెవల్ ఓపెన్ టూ ఆల్ స్టైల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న మంచిర్యాలకు చెందిన 9మంది విద్యార్థులు కరాటేలో గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ బొల్లంపల్లి శ్రీనివాస్, ఆర్‌బీహెచ్‌వీ పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోల్డ్‌మెడల్ సాధించిన వారిలో బి.శివ అశ్మిత, ఎన్.సంజన, ఆర్.అక్షయ, కె.వైశ్విక్, సీహెచ్ చరణ్, హార్దిక్ తివారి, సిల్వర్ మెడల్‌ను కె.హారిక, కె.అక్షర, బి.సాగరికలు సాధించినట్లు తెలిపారు.

దండేపల్లి: జిల్లాలోని సోమగూడెంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఆల్ స్టైల్ కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో దండేపల్లి మండలం లింగాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. అండర్ 14 విభాగంలో పలువురు విద్యార్థులు బహుమతులు గెలుపొందినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: తెలంగాణ క్రైస్తవ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకం కింద అర్హత గల క్రైస్తవ మైనారిటీ మహిళల నుంచి ఉచిత కుట్టు మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు, అర్హులైన క్రైస్తవ మహిళలు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న హమాలీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని సివిల్ సప్లయ్ హమాలీలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన హమాలీ రేట్లు ఏడాదిగా అమలు చేయకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కమిషనర్‌కు విన్నవించినా స్పందన లేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 1 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలని కోరారు. ఈమేరకు కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, సత్యనారాయణ, సత్తయ్య, సంపత్, రాజన్న, చంద్రశేఖర్, శ్రీనివాస్, బాపన్న పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో



లక్సెట్టిపేట: రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

చెన్నూర్/లక్సెట్టిపేట/జైపూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు రాస్తారోకో, ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు ఏడాదికి రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఏడాది పాటు మభ్యపెట్టి చివరకు రూ.12వేలు ఇస్తామని ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. చెన్నూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ధర్నా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. లక్సెట్టిపేటలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద, జైపూర్ మండల కేంద్రంలోని మంచిర్యాల-చెన్నూర్ 63వ నంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో లక్సెట్టిపేటలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, చెన్నూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లెల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, జైపూర్‌లో డాక్టర్ రాజా రమేశ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బల్మూరి అరవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని రైల్వే కొత్త అండర్‌బ్రిడ్జి నుంచి అండర్‌గ్రౌండ్ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో చేయకుండా, పాత అండర్ బ్రిడ్జి వద్దకు తీసుకొచ్చి వదిలేయడంతో ఇబ్బందిగా మారుతుందంటూ 5వ వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుకు వినతిపత్రం అందించారు.

పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి



కమిషనర్‌కు సూచనలు చేస్తున్న కలెక్టర్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ 4వార్డు పరిధిలో నిర్వహిస్తున్న డంప్‌యార్డును సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి సందర్శించారు. రోజువారీగా డంప్ చేస్తున్న చెత్తాచెదారాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంప్ యార్డుకు తరలించాలని సూచించారు. అంతర్గత రహదారులు, మురికి నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్ర పరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీకృత కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేశారు. మార్కెట్ ప్రాంగణంలో పారిశుద్ధ్య లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కూరగాయల విక్రయదారులకు అసౌకర్యం కలుగకుండా తాగునీరు, మరుగుదొడ్లు ఇతరత్ర సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును ఆదేశించారు. కన్నాలలో కొనసాగుతున్న అమృత్ 2.0నిర్మాణ పనుల వద్దకు వెళ్లి పరిశీలించారు. జిల్లా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 2025 డైరీని కలెక్టర్ కుమార్‌దీపక్, అసిస్టెంట్ కలెక్టర్ సబావత్ మోతీలాల్ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

బొగ్గుబాయి వార్తలు

సీఎండీని కలిసిన మాజీ ఎమ్మెల్యే

మందమర్రిరూరల్: సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌ను చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన ఆఫీస్‌లో నూతన సంవత్సరం సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఐటీ ఫైలింగ్‌కు 31వరకు గడువు

శ్రీరాంపూర్: పాన్‌కార్డుతో ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకోకుండా ఐటీ టాక్స్ ఫైలింగ్ చేయని సింగరేణి ఉద్యోగులకు ఫైలింగ్ చేసుకోవడానికి గడువు పెంచారు. ప్రస్తుత గడువు ఈ నెల 15వరకు ఉండగా నేడు ఆదాయ పన్ను శాఖ దీనిని 31వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు.

క్రీడాకారునికి అభినందన

మందమర్రిరూరల్: రాష్ట్ర 11వ స్టేట్ లెవెల్ అథ్లెటిక్స్ పోటీల్లో మందమర్రి ఏరియా(ఎఎస్‌వో)లో సర్వే చైన్‌మెన్‌గా విధులు నిర్వర్తించే సమ్మయ్య పాల్గొని పథకాలు సాధించారు. ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో సోమవారం సమ్మయ్యను ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు తోటి అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందించారు.

సమ్మె విజయవంతం చేయండి

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 18న ఒక్కరోజు టోకెన్ సమ్మె చేయడానికి నిర్ణయించినట్లు హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి తెలిపారు. కార్మికులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని

కోల్ ఇండియా పోటీల్లో రాణించాలి

• శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ



బహుమతి ప్రదానం చేస్తున్న జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణి క్రీడాకారులు కోల్ ఇండియా పోటీల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో సోమవారం వార్షిక క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేశారు. బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన అజయ్, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో బ్రాంచ్ మెడల్ సాధించిన ఈశ్వర చారి, వెంకటేశ్వరరావులను సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం (పర్సనల్) అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షణకు ప్రాధాన్యతనివ్వాలి

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తిలో రక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జీఎం సూర్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్ వీటీసీలో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీస్(ఎక్స్‌ట్రనల్)లకు సోమవారం ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బొగ్గు ఉత్పత్తిలో రక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ నెల 20 వరకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటుజీఎం యస్ సత్యనారాయణ, వీటీసీ మేనేజర్ వెంకట రామారావు పాల్గొన్నారు.

క్రీడామైదానం ఏర్పాటు చేయాలని వినతి

జైపూర్: మండలంలోని టేకుమట్ల-ఇందారం మధ్యన క్రీడామైదానం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణకు స్థానిక నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. టేకుమట్ల గుడ్ల కొండయ్య ఇంటి నుంచి గోదావరి వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని, గ్రామంలో నాలుగు బోర్లు, హనుమాన్ టెంపుల్ దగ్గర భక్తుల సౌకర్యార్థం టాయిలెట్స్ చేపట్టాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు గోనె నర్సయ్య, సత్యనారాయణరావు, శ్రీను, సురేందర్, తదితరులు ఉన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: పెండింగ్‌లో ఉన్న కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్కే 6గని పై సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికులు కష్టపడి సంపాదించిన వేతనం సగం ఆదాయపన్నుకే పోతుందన్నారు. చాలాకాలంగా ఆదాయ పన్ను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కనీసం కోలిండియాలో మాదిరిగా అలవెన్స్‌లపై ఆదాయ పన్నునైనా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, ఆర్జీ 1 అధ్యక్షుడు ఆరేపల్లి రాజమోహన్, నాయకులు నరహరి, వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, ఆషాడం రమేష్, మాదాసు విజయ్, వెంకటేష్, పెరిక సదానందం, శ్రీపతి బానేశ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత


• వాహనదారులకు అవగాహన కల్పించిన ఏఎంవీఐ ఖాసిం



వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎంవీఐ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కా వాలని మంచిర్యాల ఏఎంవీఐ ఖాసిం సాహెబ్ సూ చించారు. జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రచార కరపత్రాలను వాహనదారులతో కలిసి సోమవారం ఆవిష్కరించా రు. వాహనాలకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపా టు పలువురి వాహనాలకు స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ మాట్లాడుతూ, అతివే గం, డ్రంకెన్‌డ్రైవ్, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, చిన్నారులకు వాహనాలకు ఇవ్వకుండా నియంత్రించడం, ట్రాఫిక్ నిబంధనల పాటించడంపై అవగాహన కల్పించారు. యువత మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. తనిఖీల్లో నిబంధనలు అతిక్రమించినట్లు తేలితే భారీ జరిమానాలతోపాటు అవసరమైతే వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వాహనదారులు, వాహ న చోదకులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు మహిళల తరలింపు



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై

వేమనపల్లి: నీల్వాయి పోలీసులు పేద మహిళలకు భరోసా ఇచ్చారు. ఇటీవ ల వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద 'పోలీసులు మీ కోసం' కార్యక్రమంలో భాగంగా రామగుండం సీపీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబి రం నిర్వహించారు. అందులో 67మంది కంటి చూపుతో బాధపడుతున్న వా రిని గుర్తించారు. అందులో నుంచి 25మందిని సోమవారం చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో వాహనాలు ఏర్పాటు చేసి చెన్నూర్‌కు తరలించారు. ఆపరేషన్‌తో పాటు భోజన వసతి ఏర్పాటు చేసి ఉచితంగా మందులు, అవసరాన్ని బట్టి కంటి అద్దాలు అందజేశారు. అండగా నిలిచిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

బెల్లంపల్లి: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం బెల్లంపల్లిలో ఘనంగా జరిపారు. పట్టణంలోని ఏఎంసీ ఏరియాలో ఉన్న ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం ఎదుట ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బానుమతి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, నాయకుడు అశోక్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అనురాధ, పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

చెన్నూర్: అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకురాలు విజయ అన్నారు. ఆల్ ఇండియా అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) చెన్నూర్‌లో ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్న సందర్భంగా స్థానిక జలాల్ పెట్రోల్ బంక్ సమీపంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాళ్లు శారద, గుజార్ ప్రవీణ, అమృత, విజయలక్ష్మి, మహతి, పుష్ప, మల్లమ్మ, కరీంబీ, హైదరాభాను పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

భీమిని: కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి రైతువేదికలో రైతులకు విద్యుత్ వినియోగంపై సోమవారం డీఈ రాజన్న, తాండూర్ సీఐ కుమార్ స్వామి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బెల్లంపల్లిరూరల్ ఏడీఈ రవికుమార్, కన్నెపల్లి ఎస్సై గంగారాం, ఏఈ రాజనర్సు, సబ్ ఇంజనీర్ రాహుల్, రైతులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

బెల్లంపల్లి: అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్లీనరీ సమావేశాల కరపత్రాలను పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆ సంఘం నాయకులు విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. చదువు, పోరాడు, సాధించు నినాదంతో తమ సంఘం పని చేస్తోందన్నారు. 22, 23తేదీల్లో హన్మకొండలో రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

భీమారం ప్రజావాణిలో రెండు దరఖాస్తులు

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో మధుసూధన్ తెలిపారు. రెండు ఇరిగేషన్ శాఖ సంబంధించినవి సమస్యల పరిష్కారం కోసం ఇరిగేషన్ శాఖకి పంపించనున్నట్లు ఆయన తెలిపారు.

రిజర్వేషన్లు పారదర్శకంగా అమలు చేయాలి

దండేపల్లి: కులగణన సర్వే ఆధారంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పారదర్శకంగా అమలు చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం మంచిర్యాల జిల్లా కో-కన్వీనర్ కొల్లూరి రవికుమార్ డిమాండ్ చేశారు. దండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

లక్సెట్టిపేట: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల విద్యాధికారి హెలెన్ డారతీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్, పోచమ్మ, లక్ష్మి, మల్లవ్వ, ఆదిలక్ష్మి, అమృతవ్వ, లలిత, భూలక్ష్మి, శంకరవ్వ పాల్గొన్నారు.

నియామకం

జన్నారం: మండలంలోని కామన్ పెల్లి, దేవునిగూడ, కిష్టాపూర్ గ్రామాల సంయుక్త మహేంద్ర యూత్ కమిటీని సోమవారం సంఘ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కోడిజుట్టు నరేష్, అధ్యక్షులుగా ప్రభాకర్, ఉపాధ్యక్షులు గా కోరుట్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఒడిపల్లి అంజయ్య, కోశాధికారిగా ఒడిపెల్లి రాజన్న, ప్రచార కార్యదర్శిగా నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయాలి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరవాదిలో గల వాగు వద్ద మెట్ల నిర్మాణం చేపట్టి బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్ జిలకర మహేష్ సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ జంగం కళకు వినతిపత్రాలు అందించారు.

'అవకతవకలకు తావులేకుండా చూడాలి'

మందమర్రిరూరల్: మందమర్రిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సతీష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాలు అందించారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎథిక్ అకాడమీ స్కూల్లో సోమవారం ప్లాస్టిక్ వినియోగించడం వల్ల ఏర్పడే కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్లాస్టిక్‌కు బదులు పేపర్‌బ్యాగ్‌లను అందజేశారు.

జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా రాజన్న

జన్నారం: పీఆర్టీయూ జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా పొనకల్‌కు చెందిన అనుముల రాజన్నను నియమించారు.

'విమర్శించే హక్కు బీఆర్‌ఎస్‌కు లేదు'

జైపూర్: ప్రజాప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీ లను అమలు చేస్తున్నట్లు, కానీ బీఆర్‌ఎస్ నాయకులు స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారని, అవి మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్ సోమవారం తెలిపారు.

పీఆర్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కోటపల్లి/తాండూర్/చెన్నూర్: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం హాజీపూర్ మండలం దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్లంపేట పాఠశాలలో, తాండూర్ మండల కేంద్రంలో, చెన్నూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు.

టీ షర్టుల అందజేత

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో భీమారం క్రికెట్ టీం క్రీడాకారులకు ఆర్‌కే ఫౌండేషన్ ద్వారా సోమవారం ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ బుక్యా రాజ్‌కుమార్ నాయక్ టీ షర్టులు అందజేశారు.

వరినాట్లపై అవగాహన

నెన్నెల: మండలంలోని లంబాడితండా, మన్నెగూడంలో యాసంగి వరినాట్లపై సోమవారం ఏఈవో రాంచందర్ రైతులకు అవగాహన కల్పించారు.